RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 13 సంచిక : 263 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 26 మార్చి 2025 | పేజీలు : 4 | వెల : 2/-

# కాంగ్రెస్ హైకమాండ్... గ్రీన్ సిగ్నల్!

## కొత్త మంత్రుల ప్రమాణస్వీకారానికి ముహూర్తం ఫిక్స్




హైదరాబాద్ : తెలంగాణలో మంత్రివర్గ విస్తరణకు కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఉగాది పండుగలోపు మంత్రివర్గ విస్తరణ చేసి.. ఏప్రిల్ మూడో తేదీన కొత్త మంత్రుల చేత ప్రమాణ స్వీకారం చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కొత్తగా మంత్రివర్గంలోకి ఇద్దరు బీసీ, ఒక ఎస్సీ, ఒక రెడ్డికి అవకాశం లభించినట్లు తెలుస్తోంది. బీసీల్లో శ్రీహరి ముదిరాజ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్సీల్లో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఒకవేల మైనార్టీలకు అవకాశం ఇస్తే ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్, రెడ్డిల్లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అవకాశం లభించినట్లు తెలుస్తున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు కొత్త ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అభిప్రాయాలు తీసుకొని వీరిని ఏఐసీసీ ఫైనల్ చేసినట్లు సమాచారం. మరోవైపు.. మంత్రివర్గ విస్తరణలో కచ్చితంగా తమకు పదవి దక్కుతుందన్న ఆశతో మరికొంతమంది ముఖ్య నేతలు ఇంకా పావులు కదుపుతున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బలూ నాయక్ కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. మరి వీరికి హైకమాండ్ ఎలా సర్దిచెబుతుందో చూడాలి. ఉగాదికి ముందు వెనక కచ్చితంగా విస్తరణ ఉండడం ఖాయం అన్న ప్రచారం నేపథ్యంలో పదవి ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ అటు కాంగ్రెస్ వర్గాలతో పాటు ఎమ్మెల్యేల అనుచారుల్లో ఉంది. రాష్ట్రంలో 6 మంత్రి పోస్టులు ఖాళీగా ఉండగా.. ఎవరెవరికి ఇవ్వాలన్న విషయంపై కూడా అధిష్ఠానం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. అందుకే సీఎం రేవంత్ రెడ్డి, భట్టి, ఉత్తమ్ హుటాహుటిన ఢిల్లీకి పయనమైనట్టు సమాచారం అందుతోంది. అయితే.. ఈ ఆరు పోస్టుల కోసం రాష్ట్రంలోని పలువురు నేతలు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీ పెద్దలతో మంతనాలు కూడా చేస్తున్నారు. అయితే.. ఈ ఆరు మంత్రి పదవులను గిరిజన, దళిత, వెనుకబడిన వర్గాలతో పాటు ఆయా జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పించే ప్రతిపదికన ఇవ్వాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో.. బీసీ, ఎస్సీ, రెడ్డి, మైనారిటీ లేదా ఎస్టీకి ఒకటి చొప్పున ఇవ్వనున్నట్టు తెలుస్తోంది. బీసీల్లో మున్నూరు కాపు, పద్మశాలి, గౌడ, ముదిరాజ్ వర్గాలకు చెందిన నేతలకు అవకాశం కల్పించనున్నట్టు సమాచారం. పరిశీలనలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, సుదర్శన్ రెడ్డిల పేర్లు ఉన్నాయి. మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావులను తొలగించి విజయశాంతికి, ప్రేమ్ సాగర్ రావులకు అవకాశం ఇస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతుంది.




## జీహెచ్ఎంసీ, హైడ్రా కీలక నిర్ణయం.. రెండు కమిటీల ఏర్పాటు

హైదరాబాద్: నగరంలో వరుసగా జరుగుతోన్న అగ్ని ప్రమాదాలు, వర్షాకాలంలో ఎదురయ్యే వరద ముంపు నివారణకు పరిష్కారంపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎం సీ), హైడ్రా ప్రత్యేకంగా దృష్టి సారించాయి. వరద ముంపుతోపాటు అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై కలిసి పనిచేయాలని నిర్ణయించాయి. ఈ మేరకు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశమైన హైడ్రా, జీహెచ్ఎంసీ కమిషనర్లు రంగనాథ్, ఇలంబర్తి.. వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలు, అగ్నిప్రమాదాల నివారణపై సమీక్షించారు.

అగ్ని ప్రమాదాల నివారణకు అగ్నిమాపక శాఖతో పాటు హైడ్రా, జీహెచ్ఎంసీ విభా గాలతో కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, వర్షాకాలంలో వరద ముంపు నివారణతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసేందు కు ట్రాఫిక్, హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులతో మరో కమిటీ వేయాలని కమిషనర్లు నిర్ణయించారు. ఈ రెండు కమిటీలు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికారుల సమన్వయంతో సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాయని పేర్కొన్నారు.

## జమిలి ఎన్నికలు.. జేపీసీ గడువు పొడిగింపు



దిల్లీ: జమిలి ఎన్నికల కోసం లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ కమిటీ కాల పరిమితిని పెంచేందుకు లోక్‌సభ అంగీకరించింది. భాజపా ఎంపీ పీపీ చౌదరి ప్రతిపాదించిన తీర్మానానికి సభ ఆమోదం తెలిపింది. వర్షాకాల సమావేశాల చివరివారంలో తొలి రోజు వరకు గడువు పొడిగించింది. దేశవ్యాప్తంగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఏకకాలంలో నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు ను కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉన్నందున సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటైంది. దీనిలో లోక్‌సభ నుంచి 27, రాజ్యసభ నుంచి 12 మంది సభ్యులు ఉన్నారు. అయితే.. ఈ కమిటీ కాలపరిమితి వచ్చేనెల 4న ముగియనుంది. ఈ బిల్లుపై చేయాల్సిన పని ఇంకా మిగిలివుందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ అంశంపై పలువురు న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిగాయి. ఇప్పటికే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రఖ్యాత న్యాయకోవిదుడు హరీశ్ సాల్వే, దిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.పి.షాలు కమిటీ ముందు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేశారు. జేపీసీ గడవు పొడిగించే తీర్మానానికి లోక్‌సభ తాజాగా ఆమోదం తెలిపింది.




# సంక్షోభంలో తెలుగు రాష్ట్రాలు!

## పార్లమెంట్ సాక్షిగా ఆంధ్రా - తెలంగాణ అప్పులు ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ : గత ప్రభుత్వంలో కంటే ఈ ప్రభుత్వంలో అప్పులు మరింత అధికమయ్యాయంటూ ప్రతిపక్షాలతోపాటు వామపక్ష పార్టీల నేతలు అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలపై వరుస విమర్శలు గుప్పిస్తోంటారు. అలాంటి వేళ.. కేంద్రంతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాలు చేసిన అప్పులు.. వాటి వివరాలతోపాటు దేశంలో అత్యధికంగా అప్పులు చేసిన రాష్ట్రాల జాబితాను కేంద్రం పార్లమెంట్ సాక్షిగా ప్రకటించింది. లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. 2025, మార్చి 30 నాటికి ఆంధ్రప్రదేశ్ అప్పు రూ. 5, 62, 557 కోట్లు కాగా.. తెలంగాణ రాష్ట్రంపై రూ.4, 42, 298 కోట్ల భారం ఉందని స్పష్టం చేశారు. ఏపీ అప్పులో స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) 34.7 శాతంగా ఉండగా.. తెలంగాణ అప్పులో జీఎస్‌డీపీ 26. 2శాతంగా నమోదు అయిందని చెప్పారు. అన్ని రాష్ట్రాల కంటే అత్యధికంగా తమిళనాడు అప్పు రూ.9,55,691 కోట్లుతో అగ్రస్థానంలో ఉందని కేంద్ర మంత్రి పంజక్ చౌదరి వెల్లడించారు. ఆ తర్వాత వరుస స్థానాల్లో రూ. 8, 57, 844 కోట్లతో ఉత్తరప్రదేశ్, రూ.8,12, 068 కోట్లతో మహారాష్ట్ర, రూ.7, 25, 456 కోట్లతో కర్ణాటక, రూ.7,14,196 కోట్లతో పశ్చిమబెంగాల్ ఉన్నాయని పేర్కొన్నారు. అయితే రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా ప్రకారం.. 2025, మార్చి 31వ తేదీ నాటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమిష్టి అప్పు రూ. 2, 67, 35, 462 కోట్లు ఉంటుందని కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి సోదాహరణతో వి వరించారు. ఏపీ ప్రభుత్వఅప్పుల వివరాలను కేంద్ర ఆర్థిక శాఖ మ రోసారి బయటపెట్టింది. ఏడాదికి ఏడాది అప్పులు పెరుగుతున్నట్లు అర్థమవుతోంది. అయితే ఏడాదికి ఏడాది ఈ అప్పులు పెరుగుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీగా అప్పులు పెరిగాయని కూటమి ఆరోపించింది. తాము అధికారంలోకి వస్తే సంపద సృష్టిస్తామని కూడా చెప్పుకొచ్చింది. కూటమి పాలనలో కూడా అప్పులకు చెక్ పడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**స్పష్టమైన ప్రకటన...** ప్రస్తుతం ఏపీ అప్పు అక్షరాల రూ.5.62 లక్షల కోట్లు అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. రాష్ట్ర స్థూల దేశీయ ఉత్పత్తిలో అప్పులు 34.70% ఉంటాయని వెల్లడించారు. సోమవారం లోక్ సభలో ఎంపీ మనీష్ తివారి అడిగిన ప్రశ్నకు దేశంలోని రాష్ట్రాల అప్పుల వివరాలను పంకజ చౌదరి వెల్లడించారు. రాష్ట్రాల నికర రుణ పరిమితిని ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుందని తెలిపారు.

అన్ని రాష్ట్రాలు ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టాన్ని అమలు చేస్తున్నాయని కూడా చెప్పారు.

**ఏటా పెరుగుతున్న అప్పులు...** అయితే వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భారీగా అప్పులు పెరిగాయని ఆరోపణలు ఉన్నాయి. 2019లో రాష్ట్ర అప్పులు రూ. 2,64,451 కోట్లు ఉండగా..2020లో రూ. 3,07,671 కోట్లు, 2021లో రూ. 3,53,021 కోట్లు, 2022లో సవరించిన అంచనాల తరువాత రూ. 3,93,718 కోట్లు, 2023లో బడ్జెట్ అంచనాల ప్రకారం ఏపీ ప్రభుత్వ అప్పు రూ. 442442 కోట్లు. 2024 నాటికి ఏపీ అప్పులు 5 లక్షల కోట్లకు దాటాయి. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఓ 50 వేల కోట్ల అప్పులు పెరిగాయి. అయితే ఉన్న అప్పులు తీర్చుకునేందుకు కొత్త అప్పులు తప్పడం లేదని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓ 20 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందని.. కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని కూటమి ప్రభుత్వం చెబుతోంది.

**పథకాలు అమలు కాకముందే..** ఏపీలో ఇంకా సంక్షేమ పథకాలుఅమలు ప్రారంభం కాలేదు. తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. అందులో కీలకమైనవి అన్నదాత సుఖీభవ తో పాటు తల్లికి వందనం. ఈ రెండు పథకాలు అమలు చేసేందుకు 25 వేల నుంచి 30 వేల కోట్ల రూపాయల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది.

ఏపీ ఆదాయం చూస్తే అంతంతమాత్రంగా ఉంది. ఈ పథకాలకు వేలకోట్లు అప్పు అనివార్యం. అందుకే ముమ్మందు ఈ అప్పులు మరింత పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## స్వామీ ఏమిటిది ... పీఠం కదులుతోందా ?

విశాఖలో స్వామిజీ శ్రీ స్వరూపానందేంద్ర స్వామి ప్రముఖుడిగా పేరు గడించారు. ఆయన వద్దకు వచ్చే వారిలో రాజకీయ భక్తులు ఎక్కువగా ఉంటారని ప్రతీతి. స్వామీజీ విశాఖలోని పెందుర్తి వద్ద ఇప్పటికి మూడు దశాబ్దాల క్రితం శ్రీ శారదాపీఠం పేరుతో ఆధ్యాత్మిక స్థావరాన్ని నిర్మించారు. అక్కడ నుంచే ఆయన ఆధ్యాత్మిక ప్రస్థానం మొదలైంది. ఇక దేశాన్ని ఏలే వారి నుంచి ఎంతో మంది శ్రీ శారదా పీఠాన్ని సందర్శించిన వారే. ఇంతింతై అన్నట్లుగా పీఠం ఎంతో విస్తరించింది. హైదరబాద్ లో కూడా పీఠం ఏర్పాటు అయింది. ఉత్తరాదీ రుషీకేశ్ లో కూడా పీఠం ఉంది. ఇదిలా ఉంటే ఏపీలో అయిదేళ్ళ పాటు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం హయాంలో శారదా పీఠం ఒక వెలుగు వెలిగింది అని చెబుతారు. వార్షిక ఉత్సవాలకు ముఖ్యమంత్రి హోదాలో జగన్ తప్పనిసరిగా వచ్చేవారు. ఆయన చేత రాజశ్యామల హోమం వంటివి స్వామీజీ చేయించేవారు. ఇక భీమిలీ వద్ద పీఠం వేద పాఠశాల కోసం వైసీపీ ప్రభుత్వం భారీ ఎత్తున భూమిని అందించింది. దీని మీద కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చర్యలు తీసుకుని ప్రభుత్వం పరం చేసింది. తిరుమలలో పీఠం తరఫున నిర్మాణాలను కూడా కూల్చేందుకు టీటీడీ చట్టబద్ధమైన చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇపుడు విశాఖలో ఉన్న శ్రీ శారదాపీఠం మీద కూడా చర్యలకు రంగం సిద్ధం అవుతోంది అని అంటున్నారు. ప్రభుత్వ భూములలో ఉన్న శ్రీ శారదా పీఠాన్ని వెంటనే తొలగించాలని పెందుర్తికి చెందిన తహశీల్దార్ తాజాగా నోటీసులు జారీ చేయడంతో ఇది అతి పెద్ద చర్చకు తావిస్తోంది. చినముషిడివాడ సర్వే నంబర్ 90లో ప్రభుత్వానికి చెందిన 72 సెంట్లో పోరంబోకు రాస్తాలో 22 సెంట్ల భూమిని ఆక్రమించారు అని శారదాపీఠం మీద అభియోగం మోపుతూ ఈ నోటీసులు జారీ చేశారని అంటున్నారు. అందువల్ల ఏడు రోజుల వ్యవధిలోపల ఈ ఆక్రమిత భూముల్లోని నిర్మాణాలను తొలగించాలని స్పష్టం చేశారు. దీంతో ఏమి జరుగుతుంది అన్న చర్చ అంతటా సాగుతోంది. శ్రీ శారదా పీఠాన్ని తొంబై దశకంలో ప్రారంభించారు. మొదట చిన్నగా ఉన్న ఈ పీఠం ఆ తరువాత బాగా విస్తరించింది. అన్ని రకాలైన సదుపాయాలతో ఆస్తిక జనులకు ఆశ్రమంగా మారింది. వీవీఐపీలు ఎంతో మంది పీఠాన్ని సందర్శిస్తూ వచ్చారు. దాంతో ఈ పీఠం విషయంలో ఇలాంటి అభియోగాలు రావడంతో ఏమిటిది అని అంతా ఆలోచిస్తున్నారు నిజంగా ఆక్రమణలు ఉంటే తొలగించాల్సిందే అన్న మాట వైపు ఉంటే ఏనాడో కట్టిన నిర్మాణాల మీద ఇపుడు నోటీసులు అన్నది మరో వాదనగా ఉంది. కూటమి ప్రభుత్వం ఏపీలో అధికారంలోకి వచ్చాక స్వామీజీ ఏపీ నుంచి దూరంగా ఉంటున్నారు ఆయన ఉత్తరాదిన రుషీకేశ్ లో ఉంటున్నారని చెబుతున్నారు. దీని మీద పీఠం నిర్వాహకులు ఏమి చేస్తారు అన్నది ఆసక్తికరంగా మారింది.

## భూతాపం.. భవితకు శాపం



మిర్యాలగూడ : వాతావరణంలో ఇటీవలి కాలంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా భూతాపం పెరిగి వాతావరణం విపరీతంగా వేడెక్కుతోంది. దీంతో మార్చి ప్రారంభంలోనే ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వాతావరణంలో చోటు చేసుకుంటున్న ఈ మార్పులకు మనమే కారణమని నిపుణులు చెప్తున్నారు. ఈ మార్పులపై సమరం సాగిస్తూ ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఏటా మార్చి 23న 'ప్రపంచ వాతావరణ దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

**కాటేస్తున్న కాలుష్యం..**

ఉమ్మడి జిల్లాపై గత ఏడెనిమిదేళ్లుగా కాలుష్యం కాటేస్తుంది. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పెద్ద, మధ్య తరహా, చిన్న పరిశ్రమలు వందల సంఖ్యలో వెలుస్తున్నాయి. వీటి నిర్మాణానికి చెట్లను నరుకుతుండగా వీటి నుంచి వచ్చే కాలుష్యంతో వాతావరణంలోని గాలి, నీరు కలుషితమై మానవ మనుగడ ప్రమాదంలో పడుతుంది.

**భారీ వృక్షాలు నేలమట్టం..**

మానవాళికి జీవవాయువు అందించే భారీ వృక్షాలు ఇటీవల కాలంలో ఉమ్మడి జిల్లాలో అనేక నేలమట్టం అయ్యాయి. మరో వైపు ప్రధాన వ్యాపార కేంద్రాలైన నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరి, కోదాడ వంటి పట్టణాల్లో భవన నిర్మాణం రంగం భారీగా సాగుతుంది. వీటికి కలప కోసం సైతం చెట్లను నరికేయాల్సిన పరిస్థితి నెలకొంది.

**విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగం..**

గత పదేళ్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. ప్రభుత్వాలు నిషేధించిన పలు ప్లాస్టిక్ ఉత్పత్తులను యథేచ్ఛగా వాడుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇవి భూమిలో కలిసేందుకు సుమారు 200 నుంచి వెయ్యేళ్ల వరకు సమయం పడుతుంది. ఈ ప్లాస్టిక్ వినియోగంతో వాతావరణానికి పెను ప్రమాదం సంభవిస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**మొక్కలు నాటడమే ఏకైక మార్గం...**

రావుల శ్రీనివాస్, పర్యావరణ ప్రేమికుడు, మిర్యాలగూడ.

అభివృద్ధి పేరుతో చెట్లను నరికేస్తున్నారు. మానవ మనుగడ సజావుగా సాగాలంటే చెట్లను నరకడం ఆపాలి. దీంతో అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని ప్రభుత్వాలు చెప్తున్నాయి. దీన్ని నివారించాలంటే ప్రజలే ముందుకు వచ్చి స్వచ్ఛందగా మొక్కలు నాటుతూ వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలి.

## సేంద్రియ ఎరువు.. తయారీ సులువు




కరీంనగర్ : స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కరీంనగర్ నగరపాలక సంస్థ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకు పకడ్బందీగా చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే 31వ డివిజన్‌లో ప్రయోగాత్మకంగా పరిశీలిస్తున్నారు. అంతేకాకుండా మార్కెట్ల నుంచి వచ్చే కుళ్లిన కూరగాయలు, హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి వచ్చే ఆహార పదార్థాలను డంపింగ్‌యార్డుకు తరలించకుండా సేంద్రియ ఎరువు తయారు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు నగరపాలక సంస్థ వేస్ట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో ఇటీవల యంత్రాలను ప్రదర్శించారు. కంపోస్టు ఎరువు తయారీకి కావాల్సిన యంత్రాలు, పనితీరు గురించి ఆయా ప్రతినిధులు వివరించారు. **కోళ్ల ఫారాలకు బ్లాక్ స్లోడ్జర్ ఫ్లై :** కోళ్ల ఫారాల్లో ఉండే హానికర ఈగలను, వాసనను తగ్గించడంతోపాటు వ్యర్థాల నుంచి వచ్చే కీటకాలను అరికట్టడానికి, ఫుడ్ వేస్టేజీ తినేందుకు బ్లాక్ స్లోడ్జర్ ఫ్లై కీటకాలు ఉపయోగపడతాయి. ఇవి వాటిని తిని, సేంద్రియ ఎరువుగా మారుస్తాయి. మొదట ఇవి పురుగుల మాదిరిగా ఉండి ఈగల తరహాల వృద్ధి చెందుతాయి. వీటితో ఎలాంటి హాని ఉండదు. 40 రోజుల తర్వాత ఇవి చనిపోతాయి.

**బయోగ్యాస్ తయారీ :** హోటళ్లు, రెస్టారెంట్లు, కల్యాణ మండపాల నుంచి వచ్చే ఆహార వ్యర్థాలు, కుళ్లిన కూరగాయలు, చికెన్, మటన్ వ్యర్థాలతో గ్యాస్ తయారీ చేయొచ్చు. ప్రస్తుతం కార్పొరేషన్ నుంచి తడి చెత్త మొత్తం 8 టన్నులు వస్తోంది. 10 టన్నుల చెత్తకు కావాల్సిన బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తీసుకుంటున్నారు. దీనిని ఉపయోగించుకుంటే గ్యాస్ తయారీ చేసి హోటళ్లకు సరఫరా చేసే వీలుంది.

చాక్లెట్ కవర్, ప్లాస్టిక్ కవర్లతో టైల్స్ : కుర్‌కురే ప్యాకెట్, చాక్లెట్ కవర్, ఒకసారి వాడి పడేసే నీళ్ల సీసాలు, ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులతో టైల్స్, కుర్చీలు, టేబుళ్లు, పలకలు, పెన్నులు, ట్రేలు వంటివి తయారు చేసేందుకు ఏరోబిక్ బయో కంపోస్టర్ వినియోగిస్తున్నారు. ఈ యంత్రం కొనుగోలు ఖర్చుతో కూడుకున్నది కావడంతో పురపాలికలు తీసుకొని మహిళా సంఘాలకు అప్పగిస్తే చెత్తలో ప్లాస్టిక్ శాతం తగ్గుతుంది.

**పనితీరును వివరిస్తున్న ప్రతినిధి**

ఇళ్లలో మిగిలిన ఆహార పదార్థాలు, కుళ్లిన కూరగాయలు, పండ్ల తొక్కలు వంటివి చెత్తలో పడేయకుండా ఇంటి దగ్గరే సేంద్రియ ఎరువుగా మార్చవచ్చు. రెండు డబ్బాలు తీసుకొని ఒక డబ్బాలో నెల రోజుల వరకు వీటిని పోయాలి. నిండిన తర్వాత మరొక డబ్బాలో పోయాలి. ఎండిన కొబ్బరిపొడి మిక్స్ చేయాలి. ఆటోమేటిక్‌గా పురుగులు తయారవుతాయి. కొద్దిరోజులకే ఎరువుగా మారుతోంది.

## వడగాలుల కాలం.. వడగళ్ల ప్రతాపం



కాగజ్‌నగర్ : జిల్లాలో వడగాలులు వీచే వేసవి కాలంలో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. కౌటాల, రెబ్బెన, సిర్పూర్(టి) మండలాల్లో పాక్షికంగా, కాగజ్‌నగర్ పట్టణం, మండలంలోని పలు గ్రామాలపై తీవ్ర ప్రభావం చూపింది. పంటలు చాలాచోట్ల దెబ్బతిన్నాయి. ఇళ్ల పైకప్పులు లేచిపోగా, చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. కాగజ్‌నగర్ మండలంలోని జంబుగా, నజ్రూల్‌నగర్ విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలోని స్తంభాలు విరిగి పడ్డాయి.

**దెబ్బతిన్న 600 ఇళ్లు** వడగళ్ల వానకు కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో సుమారు 600 ఇళ్లకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. పట్టణం, నజ్రూల్‌నగర్, వల్లకొండ, నాగంపేట్, రాస్పెల్లి పంచాయతీల్లో అధికంగా నష్టం వాటిల్లింది. కాగజ్‌నగర్ మండలంలో 37, పట్టణంలో 10 ఇళ్లకు నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. మరిన్ని ఇళ్లకు సైతం నష్టం వాటిల్లిందని, పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని తహసీల్దార్ కిరణ్ తెలిపారు.

**మూడు వేల ఎకరాల్లో మొక్కజొన్న నష్టం**

ఉమ్మడి నజ్రూల్‌నగర్ పంచాయతీలోని 13 గ్రామాలు, అనుకోడ, ఈజ్‌గాం, వల్లకొండ, తదితర గ్రామాల్లో సుమారు అయిదు వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. శనివారం ఆయా గ్రామాల్లో ఏఈఓలు పరిశీలించగా.. సుమారు 3 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక సర్వేలో తేలిందని ఏఓ రామకృష్ణ తెలిపారు.

**67 ఎకరాల్లో మామిడి తోటలకు..**

నజ్రూల్‌నగర్, జంబుగ, గజ్జిగూడ, గన్నారం, నాగంపేట్ గ్రామాల్లో 67 ఎకరాల్లో మామిడి తోటలకు నష్టం వాటిల్లినట్టు సర్వే నిర్వహించిన కాగజ్‌నగర్ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి సుప్రజ చెప్పారు.

**స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు**

కోసిని, నజ్రూల్‌నగర్, భట్టుపల్లి, జంబుగ విద్యుత్తు ఉప కేంద్రాల పరిధిలో 120 విద్యుత్తు స్తంభాలు విరిగి పడ్డాయి. ఎస్‌ఈ శేషారావు, డీఈ నాగరాజుల ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. విద్యుత్తు లైన్లు తెగిపోవడం, స్తంభాలు నేలకొరగడంతో.. పలు గ్రామాల్లో భగీరథ నీటి సరఫరా నిలిచింది. విలేజి నం.8లో మాజీ సర్పంచి గోకుల్ రాయ్ జనరేటర్ ఏర్పాటు చేయడంతో.. రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నీటిని నింపుకొని అవసరాలు తీర్చుకున్నారు.

**ఏ అధికారి రాలేదు.. బికాస్‌రాయ్, విలేజ్ నం.8**

గాలులకు ఇంటి పైకప్పు ఆనవాళ్లు లేకుండా పోయింది. రాత్రంతా పిల్లలతో జాగరణ చేయాల్సి వచ్చింది. ఉదయం అధికారులకు సమాచారమిచ్చినా ఎవరూ రాలేదు. ఓవైపు నిల్వ నీడలేక, మరోవైపు సాగుచేసిన కూరగాయల తోట దెబ్బతినడంతో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు ఆదుకోవాలి.

## సన్నం సరే.. ఉన్న బియ్యం మాటేంది?

ఆదిలాబాద్ :ఓ చౌకధరల దుకాణంలో ఈ నెల బియ్యం పంపిణీ చేయగా.. మిగిలిన దొడ్డు బియ్యం బస్తాలివి. సన్నబియ్యం ఇస్తే నిల్వ ఉన్న దొడ్డు బియ్యం ఏం చేస్తారో తెలియక డీలర్లలో ఆందోళన నెలకొంది. వీటిని తిరిగి ప్రభుత్వ గోదాముకు తీసుకెళ్లాకే సన్నబియ్యం దుకాణాలకు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు. చౌకధరల దుకాణాల్లో వచ్చే నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా.. దుకాణాల్లో పేరుకుపోయిన దొడ్డు బియ్యం నిల్వలపై డీలర్లలో ఆందోళన కనిపిస్తోంది. పోర్టబులిటీ సౌకర్యంతో డీలర్లు కోటాకు మించి బియ్యం తీసుకునే వెసులుబాటు ఉండటంతో ఇప్పుడు అదే వారికి ఇక్కట్లు తెచ్చిపెట్టనుంది. పంపిణీలో ఈ సారి ఆలస్యం కావడంతో మెజార్టీ డీలర్లు ఏప్రిల్‌లో బియ్యం రావడం ఆలస్యమవుతుందని నిల్వలు తెచ్చిపెట్టుకున్నారు. ఫలితంగా అలా మిగులు బియ్యం వెనక్కి తీసుకోకుండానే ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి చర్యలు తీసుకోనుండటం వారిని కలవరపెడుతోంది.చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు దొడ్డుబియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఆహార భద్రతకార్డు(ఎఫ్ఎస్‌సీ) ఒక్కో యూనిట్కు ఆరు కిలోల చొప్పున, అంత్యోదయ ఆహారభద్రత కార్డుదారు(ఏఎఫ్ఎస్‌సీ)కు 30 కిలోల చొప్పున, అదే అన్నపూర్ణ అన్నయోజన (ఏఏవై) కార్డుదారులకు 10 కిలోలు ఉచితంగా పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15 వరకు లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా.. కోటా కేటాయింపులో ఆలస్యం కారణంగా ఈ తేదీల్లో తరచూ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు పోర్టబులిటీ సౌకర్యంతో కార్డుదారు రాష్ట్రంలో బియ్యం ఏ దుకాణంలోనైనా తీసుకునే వెసులుబాటు ఉండటంతో.. డీలర్లు నిర్ణీత కోటాకు మించి బియ్యం తీసుకుంటున్నారు. తాజాగా ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తామని చెబుతుండటంతో దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలు భారీగా మిగిలిపోయాయి. ఏప్రిల్ మాసానికి ఇంకా వారం రోజుల గడువు ఉండటంతో దుకాణ నిల్వలు ఎప్పుడు ఖాళీ చేస్తారో స్పష్టత రావాల్సి ఉంది. ఇదే విషయమై అధికార వర్గాలను సంప్రదిస్తే దీనిపై ఆదేశాలు రావాల్సి ఉందని సమాధానం ఇస్తున్నారు. మరోవైపు ఆన్‌లైన్‌లో చూపిస్తున్న వివరాలకు, దుకాణంలోని మిగులు బియ్యం లెక్కలు సరిచూసుకోవడంలో డీలర్లు మల్లగుల్లాలు పడుతున్నారు.

## అరకొర సిబ్బంది.. అంతటా ఇబ్బంది

నల్గొండ : సూర్యుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. వృద్ధులు, యువకులు, చిన్నారులు అనే తేడా లేకుండా ఎక్కువ శాతం మంది వేసవిలో వచ్చే రోగాలబారిన పడుతున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా జనరల్ ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. అయితే ఏ విభాగంలోనూ పూర్తి స్థాయిలో వైద్యులు, నర్సులు, సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారిపైనే భారం పడుతోంది. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా మూడేళ్లు పైబడిన కారణంగా కొంతమంది వైద్యాధికారులు వెళ్లాల్సి వచ్చింది.

వైద్యవిధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల్లో దేవరకొండ, మిర్యాలగూ




డ, నకిరేకల్, నాగార్జునసాగర్, మర్రిగూడ, ఆసుత్రులతో పాటు వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, యూపీహెచ్‌సీలు, బస్తీదవాఖానాల్లో వైద్యులు, నర్సులు, కిందిస్థాయి సిబ్బంది సరిపడలేక ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి, వైద్యకళాశాల ప్రిన్సిపల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ వంటి ప్రధాన పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇన్‌ఛార్జులతో కాలం వెళ్లదీస్తున్నారు.

**నివేదికలు పంపాం:**డా. మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి విభాగాల వారీగా ఖాళీల వివరాలను కలెక్టర్‌తో పాటు ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వ ఆదేశాలు వస్తే నియామకాలు జరుగుతాయి. ప్రస్తుతానికి జిల్లాలో ఎక్కడా ఎవరికి ఇబ్బంది లేకుండా ఉన్న వైద్యులు, సిబ్బందితో వైద్య సేవలు అందిస్తున్నాం.

## శంకుస్థాపన ముహూర్తం సమీపిస్తోంది!

వేంసూర జిల్లాలో తొలి పామాయిల్ కర్మాగార పనుల ప్రారంభోత్సవానికి ముహూర్తం దగ్గరపడుతోంది. వేంసూరు మండలం కల్లూరుగూడెంలో కర్మాగార నిర్మాణానికి గతంలో నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ ఉగాది పర్వదినాన శంకుస్థాపనకు ఆయిల్ ఫెడ్ అధికారులు ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు.

**ఏర్పాట్లు ఇలా..**

కల్లూరుగూడెంలో 42 ఎకరాల్లో రూ.87 కోట్లతో పామాయిల్ కర్మాగారం కొత్తగా నిర్మించనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్ ఫెడ్ రాష్ట్ర అధికారుల ఆదేశాలతో పరిశ్రమ శంకుస్థాపనకు సంబంధించిన ఏర్పాట్లు కొద్దిరోజులుగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ప్రధాన రహదారి నుంచి కర్మాగారానికి 60 అడుగుల మార్గాన్ని శరవేగంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే స్థల సేకరణ పూర్తిచేసి ఫెన్సింగ్ వేయగా.. ఆ తర్వాత బుష్ కటింగ్ పనులు పూర్తిచేశారు.

**తోటల విస్తరణకు మరింత అవకాశం**

కర్మాగారం పూర్తయితే జిల్లాలో, ముఖ్యంగా సత్తుపల్లి నియోజకవర్గంలో ఆయిల్‌పాం సాగు మరింత జోరందుకుంటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. కర్మాగార ప్రతిపాదనకు ముందే వేంసూరుతో పాటు సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు మండలాల్లో తోటలు వేసేందుకు రైతులు ఆసక్తి చూపారు. తాజాగా కొత్త పరిశ్రమ రానున్న నేపథ్యంలో 50-60 ఏళ్ల వయసున్న మామిడి తోటలను తొలగించి ఆయిల్‌పాం మొక్కలు నాటేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఫిబ్రవరి, మార్చిలోనే వేంసూరు మండలంలో 150 ఎకరాల్లో మామిడి తోటలు తొలగించడం విశేషం. మామిడితో పోల్చితే ఆయిల్‌పాం తోటల నిర్వహణ, యాజమాన్య పద్ధతులు తేలిక. అధిక దిగుబడులతో పాటు వాటి రవాణా సులువుకానుంది. ప్రభుత్వ రాయితీలతో తోటల విస్తీర్ణం వచ్చే ఏడాదికల్లా మరింత పెరిగే అవకాశముంది. ప్రస్తుత లెక్కల ప్రకారం.. ఖమ్మం 1,478, పాలేరు 3,732, మధిర 3,741, సత్తుపల్లి 11,672, వైరా నియోజకవర్గంలో 5,190 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతోంది.

## ప్రాజెక్టులు నిండకుంటే ఇక్కట్లే!

ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ నెల ఆరంభం నుంచి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతున్నాయి. వచ్చే రెణ్నెల్లు భానుడి సెగలు, వడగాలులు తప్పవని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. మరోవైపు భూగర్భజలాలు పడిపోతున్నాయి. వ్యవసాయ బోర్లు వట్టిపోతున్నాయి. నదీ జలాలు అడుగంటుతున్నాయి. ఈ సమయంలో ప్రణాళికాబద్ధంగా, ప్రత్యామ్నాయాలతో ముందుకుసాగితేనే సాగు, తాగు ఎద్దడిని సమర్థంగా ఎదుర్కోగలం. ప్రధాన ప్రాజెక్టుల వారీగా ప్రస్తుత పరిస్థితులు, అధికారులు చేపట్టాల్సిన చర్యలను పరిశీలిస్తే..

**పాలేరు జలాశయం**

జలాశయానికి నాగార్జునసాగర్ నుంచి 5,551 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. వీటిల్లోంచి ఎడమ కాలువ ఆయకట్టుకు 4,606, పాత కాలువకు 200, 'భక్త రామదాసు' ఆయకట్టుకు 275 క్యూసెక్కుల నీరిస్తున్నారు. సాగు సంగతి ఇలాఉంటే.. సూర్యాపేట, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల తాగునీటికి మరో 135 క్యూసెక్కులు సరఫరా జరుగుతోంది. సాగర్ నుంచి మరో నెలపాటు జలాలొస్తాయని అంచనా. ఆ తర్వాత రిజర్వాయర్ నుంచి 2,375 ఆవాసాలకు రెణ్నెల్లపాటు తాగునీరివ్వాలి. ఏప్రిల్‌లో సాగర్ నీరివ్వకుంటే గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదు. ప్రస్తుత జలాల్ని రైతులు సాగుకు వారబందీతో పొదుపుగా వాడుకోవాలి.

నిల్వ సామర్థ్యం: 2.558 టీఎంసీలు
ప్రస్తుత నిల్వలు: 1.768 టీఎంసీలు
పూర్తిస్థాయి నీటిమట్టం (అడుగుల్లో): 23
ప్రస్తుతం: 18.25

వైరా..వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లోని 11 మండలాల్లోని 465 గ్రామాల అవసరాలకు.. రోజుకు 10 కోట్ల లీటర్ల తాగునీరివ్వాల్సి ఉంది. ఇది సాధ్యం కావాలంటే నీటిమట్టం 13 అడుగులకు తగ్గకుండా చూడాలి. మరోవైపు, ఆయకట్టు పంటలు కాపాడుకునేందుకు జలాలు అందిస్తున్నారు. ఎండల తీవ్రతతో నీటి ఆవిరి శాతం పెరుగుతుంది. సాగర్ జలాలు అరకొరగా సరఫరా అవుతున్నందున, వచ్చే రెణ్నెల్లు నిల్వల్ని పొదుపుగా వాడేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

పూర్తిస్థాయి నీటిమట్టం (అడుగుల్లో): 18.3
ప్రస్తుతం: 12.2

"జిల్లాలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకుసాగుతాం. గ్రామీణ నీటిసరఫరా, భగీరథ గ్రిడ్ విభాగం సమన్వయంతో నిల్వల నిర్వహణ, శుద్ధి, సరఫరా చేపడుతున్నాం. ప్రాజెక్టుల్లో నిల్వలు తగ్గితే ప్రత్యామ్నాయ వనరులు సద్వినియోగం చేసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రాజెక్టుల కింద చివరి ఆయకట్టుకు సైతం వారబందీ విధానంలో నీరిస్తున్నాం. వృథాకు అడ్డుకట్ట వేస్తూనే, జలాలు పొదుపుగా వాడుకోవాలని రైతులకు సూచిస్తున్నాం."మిషన్ భగీరథ, నీటిపారుదల శాఖ అధికారులు

# పల్లెల్లో ఆర్థిక సౌరభాలు

నల్గొండ : రైతులు, మహిళా సంఘాలు, ఇతరులు ఆర్థిక పరిపుష్టి సాధించడానికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. అర్హులకు ప్రయోజనం అందించేందుకు పీఎం కేయిఎస్‌యుఎం-ఏ పథకాన్ని అమలు చేస్తోంది. దీని ప్రకారం వ్యవసాయానికి అనుకూలంగా లేని, బంజరు భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రెడ్కో సంస్థ అర్హత కలిగిన రైతుల నుంచి సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిలకడగా 25 సంవత్సరాల పాటు ఆదాయం పొందే ప్రాజెక్టు ఇది. ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
అర్హులెవరంటే..రైతులు(వ్యక్తిగతంగా), రైతు ఉత్పత్తి సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, మండల గ్రామ సమాఖ్యలు, పంచాయతీ స్థానిక సంస్థలు భూమిని లీజుకు తీసుకొని కూడా సౌర ప్లాంట్ యూనిట్‌ను నిర్ణీత సామర్థ్యంతో ఏర్పాటు చేసుకోవచ్చు.
ముఖ్యాంశాలిలా..
మొత్తం 4 వేల మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి లక్ష్యం
ఒక్కో యూనిట్ సామర్థ్యం: 500 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల



వరకు.ఒక మెగావాట్ సౌర విద్యుదుత్పత్తికి మూడున్నర నుంచి నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ప్లాంట్ నిర్మించాల్సి ఉంటుంది.
ఉత్పత్తి చేసిన సౌర విద్యుత్‌ను తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీజీ-ఈఆర్సీ) నిర్ణయించిన టారిఫ్ ప్రకారం కొనుగోలు చేస్తారు. ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్: %www.tgredco.telangana.gov.in% ను సంప్రదించాలి.
పూర్తి సమాచారం, సందేహాలు నివృత్తికి..రెడ్కో జిల్లా కార్యాలయం నల్గొండలో సంప్రదించాలి. టెలిఫోన్ నంబర్: 08682 224447, చరవాణి నెంబరు: 98318 78596, 63049 03923 సంప్రదించవచ్చు.

**భూములు పరిశీలిస్తున్నాం**

పాండురంగారావు, రెడ్కో సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్, నల్గొండ
ఉపయోగంలో లేని భూముల్లో సౌర ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిపై మహిళా సంఘాలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సకాలంలో ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసి సమాచారం పొందవచ్చు. కలెక్టర్ ఆదేశంతో నల్గొండ జిల్లాలో సౌర విద్యుదుత్పత్తికి కావాల్సిన ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పరిశీలించాల్సి ఉంది.

## నాణ్యతా ప్రమాణాలు పట్టేదెవరికి?

పెద్దపల్లి : రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ఉద్దేశించిన ఈ-నామ్ వ్యవస్థ వ్యాపారులకు వరంగా మారింది. పెద్దపల్లి మార్కెట్‌లో రైతులు తెచ్చిన పత్తికి నాణ్యతతో సంబంధం లేకుండా ధరలు నిర్ణయిస్తున్నారు. ఈ విషయంలో భారత పత్తి సంస్థ(సీసీఐ) చెల్లించే మద్దతు ధరను పరిగణనలోకి తీసుకోవడం లేదు. ప్రస్తుత సీజన్ ఆరంభంలో 8 శాతం తేమ కలిగిన పత్తి క్వింటాలుకు రూ.7,520 ఉండగా ఇటీవల నాణ్యత తగ్గిందనే ఉద్దేశంతో సీసీఐ మద్దతు రూ.7,430కు కుదించింది. పత్తిలోని వివిధ ప్రమాణాల స్థాయిని బట్టి మద్దతు ధర అటు ఇటుగా మారుతోంది. **పట్టించుకోని అధికారులు**సీసీఐ పత్తిలో 8-12 వరకు తేమ శాతాన్ని అనుమతిస్తుంది. నిబంధనల ప్రకారం ఒక శాతం తేమ పెరిగితే ధర కూడా ఒక శాతం తగ్గుతుంది. 12 శాతం ఉంటే రూ.7,132కు కొనుగోలు చేస్తుంది. ఈ నిబంధనను వ్యాపారులకు వర్తింపజేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. శుక్రవారం పెద్దపల్లి మార్కెట్‌కు వచ్చిన పత్తిలో తేమ 18 శాతం ఉండగా ధర రూ.5003గా నిర్ణయించారు. ఈ మేరకు సంచిపై మార్కర్‌తో రాశారు. నిబంధనల ప్రకారం రూ.6,687 వరకు చెల్లించాలి. మార్కెట్‌లో నమోదైన గరిష్ఠ ధరను ప్రామాణికంగా తీసుకున్నా రూ.6,319 చెల్లించాలి. శుక్రవారం మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.7,022 వరకు నమోదైంది. అయితే ఇవేవీ వ్యాపారులకు ప్రామాణికంగా కనిపించడం లేదు.

**వ్యాపారికి నచ్చిందే ధర**

పెద్దపల్లి మార్కెట్‌లో 11 మంది క్రియాశీలక అడ్తీదారులుండగా వీరి వద్ద 7 నుంచి 8 మంది కొనుగోలుదారులు ఖరీదు చేస్తున్నారు.
వారం రోజులుగా ఇద్దరు, ముగ్గురు కొనుగోలుదారులే తీసుకుంటున్నారు. మిల్లర్లు మార్కెట్‌వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇక ఆన్‌లైన్‌లో ఇతర మార్కెట్‌కు చెందిన ట్రేడర్లు కొనుగోలు చేసే స్థాయిలో వ్యవస్థం అభివృద్ధి చెందలేదు. నాణ్యతను నిర్ణయించే పరికరాలు అందుబాటులో లేవు. సిబ్బందిని కూడా నియమించలేదు.

## బుక్కుతున్న డిపాజిత్తులు

నంద్యాల : పాములపాడు మండలం కనకయ్య కొట్టాలలో కేసీ కాల్వ 13వ డిస్ట్రిబ్యూటరీలో పనులు చేసినట్లు ఎం.బుక్కులు చేశారు. రూ.1.40 కోట్లతో చేసిన ఈ పనులకు సంబంధించి రూ.70 వేల డిపాజిట్ మొత్తం తిరిగి చెల్లించేందుకు రూ.5 వేల వరకు వసూలు చేశారు.బండి ఆత్మకూరు మండలం సంతజూటూరు నుంచి ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని చాగలమర్రి మండలం వరకు జరిగిన పనులకు ఒక్కో బిల్లుకు రూ.1500 వరకు వసూలు చేయడం చర్చనీయాంశంగా మారింది.కేసీ కాల్వ పరిధిలో 2018లో చేసిన నీరు- చెట్టు పనుల డిపాజిట్ మొత్తాలకు సంబంధించి కొన్ని రోజులుగా ఎం.బుక్కులు చేస్తున్నారు. ఆయా పనులకు తుది(ఫైనల్) బిల్లు చేయాలంటే కచ్చితంగా నిర్ణీత మొత్తం లంచం ఇవ్వాల్సిందేనని కొంతమంది అధికారులు, సిబ్బంది డిమాండ్ చేస్తున్నారు. అడిగినంత ఇవ్వకుంటే బిల్లులు చేయడం లేదని గుత్తేదారులు గగ్గోలుపెడుతున్నారు.
కార్యాలయంలో కాసుక్కూర్చున్నారు
ఉమ్మడి జిల్లా పరిధిలో కేసీ కాల్వ పొడవునా 2 వేల వరకు పనులు జరిగాయి. ఆయా పనులకు సంబంధించి గుత్తేదారులకు డిపాజిట్ మొత్తం రూ.3 కోట్ల వరకు చెల్లించాల్సిన ఉంది. నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 30 ఎం.బుక్కులకు సంబంధించి రూ.10 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. 500 మంది గుత్తేదారులకు ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి రూ.27 వేలు చొప్పున డిపాజిట్ మొత్తాలు తిరిగి ఇవ్వాల్సి ఉంది. రూ.27 వేలు రావాల్సిన గుత్తేదారుల నుంచి రూ.1500, రూ.70 వేలు రావాల్సిన వారి నుంచి రూ.2,500 వరకు కేసీ సిబ్బంది వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.ఇవ్వకుంటే పక్కన పెట్టేస్తారుఅడిగినంత ఇవ్వకుంటే ఎం.బుక్కులు కార్యాలయాల్లోనే ఉండిపోతున్నాయి. ఈ మొత్తాలు త్వరగా ఇస్తే పే అండ్ అకౌంట్స్ కార్యాలయానికి వెళ్తాయి. లేదంటే కేసీ కార్యాలయా ల్లోనే పేరుకుపోతున్నాయి. నందికొట్కూరు, బండిఆత్మకూరు, గడివేముల, శిరివెళ్ల మండలాలకు చెందిన కొన్ని పనులకు అడిగినంత ఇవ్వకపోవడంతో రోజులకొద్దీ ఎం.బుక్కులు కార్యాలయంలోనే ఉండిపోయాయి. చివరికి గుత్తేదారులు దిగొచ్చాకే బిల్లులయ్యాయి. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన ఓ గుత్తేదారు అధికారులను ప్రసన్నం చేసుకోవడంతో పెద్ద మొత్తంలో బిల్లులు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.రూ.350 కోట్ల పనులకు చెల్లింపులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కేసీ కాల్వ పరిధిలో 2018లో నీరు- చెట్టు పనులు జరిగాయి. వీటిని సుంకేసుల ఆనకట్ట నుంచి చాగలమర్రి మండలం రాజోలి వరకు సుమారు 180 కి.మీల పొడవున చేపట్టారు. రూ.350 కోట్లు వెచ్చించి చెరువుల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, ఆయకట్టు పరిధిలోని పొలాల్లో మట్టి రహదారులు వంటి పనులు చేశారు.

# పొదుపు మరిస్తే గడ్డుకాలమే!



కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలో 1,218 గ్రామ పంచాయతీలు రెండు నగరపాలక సంస్థలు, 14 పురపాలికల్లో వచ్చే వేసవి నాటికి తాగునీటి కష్టాలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జనవరి నెలలోనే పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అవరోధాలు ఎదురవుతున్నాయి. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలతోపాటు పలు చెరువుల్లోని నీటిని శుద్ధి చేసి మిషన్ భగీరథ ద్వారా ఇళ్లకు నీళ్లందించే ప్రక్రియలో అక్కడక్కడ ఇబ్బందులున్నాయి. ముఖ్యంగా జగిత్యాల జిల్లాలోని 5 బల్దియాలకు, 346 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా నీళ్లందే విషయంలో లోపాలు పూర్తిగా తొలగిపోలేదు. పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లోనూ 20శాతం గ్రామాలకు నీరందించే పథకాలదీ ఇదే పరిస్థితి. ఇంట్రా పైప్‌లైన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం శాపంగా మారింది. ఇప్పటి నుంచే అధికారులు దృష్టి పెడితే వేసవిలో తాగు నీటి ఎద్దడి దరిచేరదు.

**సాగు అవసరాలకు వినియోగం**

ప్రధాన జలాశయాల్లోని నీటిని సాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎల్‌ఎండీ నుంచి ఉమ్మడి వరంగల్, నల్లగొండ జిల్లాల్లోని పంటలకు కాకతీయ కాలువ ద్వారా నిత్యం 4,229 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దీంతో గతేడాదితో పోలిస్తే ఈసారి ఇక్కడి జలాశయంలో నీటి మట్టం కొంత తగ్గింది. ఇదే తరహాలో వరి పంట కోసం ఏప్రిల్‌లోనూ చివరి తడికి నీళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. జాగ్రత్తగా నీటిని వినియోగించకుంటే వేసవిలో కరీంనగర్ కార్పొరేషన్‌లో తాగునీటి అవసరాలకు తిప్పలు పడాల్సి వస్తుంది. ఎల్లంపల్లి, మధ్యమానేరు జలాశయాలలో నీటి నిల్వ బాగున్నా.. పొదుపుగా వినియోగిస్తేనే వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. గతేడాదితో పోలిస్తే జగిత్యాల జిల్లాలో 15 శాతం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 6 శాతం లోటు వర్షపాతం నమోదైంది. కురిసిన వర్షాలు, నిల్వ ఉన్న నీళ్లను ప్రణాళిక ప్రకారం ఉపయోగించుకోకుంటే తీరని నష్టం, కష్టం వాటిల్లే వీలుంది.

**లోపాలు సవరిస్తేనే!**

మిషన్ భగీరథ ద్వారా నాలుగు జిల్లాల్లో రూ.3,300 కోట్లు వెచ్చించి 1,351 నీటి ట్యాంకులను నిర్మించారు. 7,692 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. పంచాయతీలతోపాటు మరో 1,126 అనుబంధ గ్రామాలకు తాగునీటి సరఫరాను మెరుగుపర్చారు. అయితే 12 నియోజకవర్గాల పరిధిలో ఆరు గ్రిడ్‌ల ద్వారా శుద్ధ జలాలను అందించే విషయంలో ఇంకా లోపాలున్నాయి. ముఖ్యంగా 18,970 మోటార్లను ఏర్పాటు చేయగా వీటిలో నిత్యం సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. రహదారులు, వాగులు, రైల్వే లైన్ల వద్ద భూగర్భ పైప్‌లైన్లలో లీకేజీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని నీటి సంప్‌లకు నీరు అందని దుస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఇలాంటి లోపాలను సవరించి తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. 'వచ్చే వేసవిలో తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా తగు శ్రద్ధ వహించాలి. ఇప్పటి నుంచే నీటి వనరుల్లో ఉన్న జలాలను సంరక్షించండి. లోపాలను సవరించుకోండి' ఇటీవల మంత్రి సీతక్క పంచాయతీ

# గుర్తింపు దక్కినా.. ఎదురు చూపులే!



మెట్‌పల్లి : మండలం ఆత్మకూర్ పల్లె దవాఖానా ఇది. 2023లో ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు దక్కింది. దీని ద్వారా మంజూరయ్యే నిధులతో మరింత అభివృద్ధి చేసుకోవచ్చని భావించారు. సుమారు రెండేళ్లు దగ్గర పడుతున్నా నిధులు విడుదల కాలేదు. నిధులు విడుదలైతే ప్రహరీ, ప్రధాన ద్వారం, ఇతర మౌలిక వసతులు, వైద్య సేవలకు అవసరమైన పరికరాలు సమకూర్చుకోవచ్చని భావిస్తున్నారు.
ప్రజలకు అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో సేవలందించడమే లక్ష్యంగా కేంద్రం జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలను(ఎన్‌క్యూఏఎస్) రూపొందించింది. ఈ ప్రమాణాలను పాటించే ప్రభుత్వ ఆసుపత్రులకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు ఇవ్వడంతో పాటు మూడేళ్ల పాటు నిధులు మంజూరు చేస్తోంది. తద్వారా ఆయా ఆసుపత్రుల్లో వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులు మరింత మెరుగుపడి ప్రయోజనం చేకూరుతుందన్నది ఆలోచన. ఎన్‌క్యూఏఎస్ కింద మొదట్లో గుర్తింపు దక్కిన ఆసుపత్రులకు నిధులు మంజూరైనా, ఆ తర్వాత ఎంపికైన వాటికి రెండేళ్లుగా నిధులు రాలేదు. జిల్లా ఆసుపత్రులు, సామాజిక, పట్టణ, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాల్లో అమలు చేస్తున్న ప్రమాణాలను అంశాల వారీగా తనిఖీ బృందాలు పరిశీలించి మార్కులు ఇస్తారు. వీటి ఆధారంగా ఆసుపత్రులకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు వస్తుంది. ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు, కనీస వసతులు, రికార్డుల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితర నాణ్యత ప్రమాణాల ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు వచ్చిన తర్వాత ఆసుపత్రి స్థాయిని బట్టి మూడేళ్ల పాటు నిధులు విడుదల చేస్తారు. 2018 నుంచి ఎన్‌క్యూఏఎస్‌కు ఎంపికవుతుండగా మొదట్లో ఎంపికైన ఇబ్రహీంపట్నం, మేడిపల్లి, కథలాపూర్ పీహెచ్‌సీలకు నిధులు మంజూరయ్యాయి. ఆ తర్వాత మళ్లీ రెండోసారి ఈ మూడు ఎన్‌క్యూఏఎస్‌కు అర్హత సాధించాయి. వీటితో పాటు దశల వారీగా మరిన్ని పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలు, పల్లె దవాఖానాలకు గుర్తింపు దక్కింది. రెండేళ్లుగా నిధులు విడుదల కావడం లేదని తెలుస్తోంది. నిధులు విడుదల చేస్తే ఆసుపత్రుల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలందేలా దోహదపడతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.
ఎన్‌క్యూఏఎస్‌కు ఎంపికైన ఆసుపత్రులు
ఎంసీహెచ్ జగిత్యాల పీహెచ్‌సీలు - 6
యుపీహెచ్‌సీలు - 3
ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు (పల్లె దవాఖానా) - 14
రెండు పల్లె దవాఖానాలకు..
- ఎన్.శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి
జిల్లాలో ఎన్‌క్యూఏఎస్ గుర్తింపునకు ఆసుపత్రులు ఎంపికవుతున్నాయి. ఇటీవల రెండు పల్లె దవాఖానాలకు గుర్తింపు వచ్చింది. ఎన్‌క్యూఏఎస్ గుర్తింపుతో మరింత ప్రయోజనం ఉంటుంది. త్వరలోనే నిధులు విడుదలవుతాయి.

# పేదలకు ఆవాసయోగం

సిరిసిల్ల: జిల్లాలో పేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. స్థలం ఉండి ఇళ్లులేనివారికి ఎంపిక చేసిన గ్రామాల్లో ఇళ్లు మంజూరు చేసింది. స్థలంలేని వారికి గతంలో అసంపూర్తి దశలో నిలిచిపోయిన రెండు పడక గదుల నిర్మాణాలను పూర్తిచేసి పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనికి ఇటీవల బడ్జెట్లో నిధులు కేటాయించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో నిధులు విడుదల చేయనున్నారు.

**అసంపూర్తి దశలో 702 గృహాలు**

జిల్లాలో 6,886 రెండు పడక గదుల ఇళ్లు మంజూరుకాగా అందులో 3,546 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 3,448 గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. 702 ఇళ్లు అసంపూర్తి దశలో నిలిచిపోయాయి. వీటిలో సిరిసిల్ల నియోజకవర్గంలో 558, వేములవాడలో 144 ఇళ్లు ఉన్నాయి. వీటిని పూర్తి చేయనున్నారు. జిల్లాలో రెండు పడక గదుల నిర్మాణ వ్యయం రూ.248.9 కోట్లు కాగా ఖర్చు చేసింది రూ.188.49 కోట్లు.నిర్మాణాలు పూర్తయినా.. కొన్ని చోట్ల మౌలిక వసతుల్లేక పంపిణీ జరగలేదు. లబ్ధిదారుల ఎంపిక కూడా జరిగింది. కారణం మౌలిక వసతుల్లేవు. గత ప్రభుత్వం పట్టణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.5.04 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.5.30 లక్షలు కేటాయించింది. అంతర్గత రహదారులు, డ్రైనేజీ, విద్యుత్తు, తాగునీరు వంటి కనీస వసతుల కల్పనకు ఒక్కోఇంటికి రూ.75 వేలు అదనంగా కేటాయించారు.రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమైన చోట మౌలిక వసతుల కల్పన కోసం జిల్లాలో గ్రామీణ ప్రాంతాల కోసం రూ.151 కోట్లు, పట్టణ ప్రాంతాల కోసం రూ.15 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వాటిలో వివిధ దశలో రూ.24 కోట్లు మాత్రమే మంజూరయ్యాయి. మౌలిక వసతులు కల్పిస్తే మరికొన్ని గృహాలు లబ్ధిదారులకు



అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.
ప్రభుత్వం ఇటీవలి బడ్జెట్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు నిధుల కేటాయింపులో ప్రాధాన్యమిచ్చింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పేర్కొన్న ఆరు గ్యారంటీల్లో ఒకటైన ఇందిరమ్మ ఇళ్లను సాధ్యమైనంత ఎక్కువగా నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులను ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. వాటిని ఎల్-1, 2, 3 విభాగాల్లో ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేశారు. వీటిలో ఎల్-1లో స్థలం ఉన్నవారు. దీనిలో మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఇళ్లు మంజూరు చేశారు. ఎల్-2లో సొంత స్థలంలేని వారిని గుర్తించారు. ఎల్-3 జాబితాలోని దరఖాస్తులను ప్రభుత్వం ఏఐ (కృత్రిమ మేధ) ద్వారా మరోసారి పరిశీలించనుంది. దీనిలో గతంలో ఇందిరమ్మ ఇళ్లు పొందినవారు, ఇళ్లు, వ్యవసాయ స్థలాలు, ఇతర ఆస్తులు ఉన్నవారిని గుర్తిస్తుంది. దీనిలో ఏది ఉన్నా ఇళ్లు మంజూరు కాదు.

# కళ.. కలేనా..?

నారాయణగూడ: పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్ పదేళ్ల క్రితం వరకు చిన్నారులతో కళకళలాడింది. ప్రస్తుతం చిన్నారుల సందడి లేక వెలవెలబోతోంది. పిల్లలు వేసవి సెలవులను బాలభవన్‌లో ఆస్వాదిస్తారు. 1966లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ దీన్ని ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏటా వేసవి శిబిరాలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించేవారు. బాలభవన్ తరఫున 'బాలశ్రీ, బాలసూర్య, బాలరత్న' పురస్కారాలు అందించేవారు. ప్రస్తుతం అవి లేవు. ప్రతినెలా బీసీ, ఓసీ పిల్లలకు నామమాత్రపు రుసుము రూ.50, ఎస్సీ, ఎస్టీ పిల్లలకు రూ.20 ఉండేది. ప్రభుత్వ పాఠశాలల నుంచి పిల్లలను బాలభవన్‌కు బస్సులో తీసుకొచ్చేవారు. ఇప్పుడా బస్సు నిరుపయోగంగా మారింది.



పోస్టులన్నీ ఖాళీ..బాలభవన్‌లో లైబ్రేరియన్, చిత్రలేఖనం, విజ్ఞానశాస్త్రం, తబలా గురువులు మినహా అన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వారిలో ఒకరు జూన్‌లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. సంగీతం, తబలా, మృదంగం, కథక్, కూచిపూడి, జానపదం, నాటకం, కరాటే, స్కేటింగ్ గురువులు కావాలి. జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గణితం, ఆంగ్లం, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులను ఇక్కడికి పంపించారు. ఒకే పోస్టులో ముగ్గురు సైన్స్ టీచర్లున్నారు. ఒక ఉపాధ్యాయురాలికి రాష్ట్రస్థాయి బాధ్యతల్ని అప్పగించడంపై విమర్శలున్నాయి. మరో ఎస్జీటీ టీచర్‌ను లైబ్రేరియన్‌గా పంపించారు. పదేళ్లుగా ఇన్‌ఛార్జి డైరెక్టర్.. ఇంతకుముందు బాలభవన్‌కు ప్రత్యేకంగా డైరెక్టర్ ఉండేవారు. పదేళ్లుగా అదనపు బాధ్యతలతో ఈ వ్యవస్థ కొనసాగుతోంది.

## గోదావరి జలాల విడుదల

అశ్వాపురం : భీమునిగుండం కొత్తూరు సీతారామ ఫేజ్-1 పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను అధికారులు విడుదల చేశారు. ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద సీతారామ ఫేజ్-2 పంప్‌హౌస్ వైపు నీళ్లు పయనిస్తున్నాయి. ములుగు జిల్లా తుపాకులగూడెంలో సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచి విడుదల చేసిన 1,200 కూసెక్కుల గోదావరి జలాలు దుమ్ముగూడెం ఆనకట్టను చేరుకొని పొంగిపొర్లుతున్నాయి. బెల్‌మౌత్ వద్ద గోదావరికి, సీతారామ ప్రధాన కాల్వకు మధ్యనున్న మట్టి కట్ట తొలగింపు పనులు పూర్తయ్యాయి. గోదావరి జలాలు సీతారామ ప్రధాన కాల్వలోకి ప్రవేశించాయి. అమెర్దా వద్ద సీతారామ హెడ్ రెగ్యులేటర్ ద్వారాలను అధికారులు తెరిచారు. గోదావరి జలాలు



భీమునిగుండం కొత్తూరు ఫేజ్-1 పంప్‌హౌస్‌కు చేరుకున్నాయి. పంప్‌హౌస్‌లోని ఏ-3 విద్యుత్తు మోటారును ఆన్ చేసి డెలివరీ సిస్టర్న్ ద్వారా సీతారామ రెండో ప్యాకేజీ ప్రధాన కాల్వలోకి విడుదలవుతున్నాయి. అక్కడి నుంచి పూసుగూడెంలోని ఫేజ్-2 పంప్‌హౌస్, కమలాపురంలోని సీతారామ ఫేజ్-3 పంప్‌హౌస్‌కు చేరుకుంటాయి. జలవనరులశాఖ ఈఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆనకట్ట పైనుంచి గోదావరి జలాలు పొంగిపొర్లుతుండటంతో సీతారామ ప్రధాన కాల్వలోకి విడుదల చేస్తున్నామని తెలిపారు.

## విపత్తు దళం.. సింగరేణి బలం

శ్రీరాంపూర్: విపత్తుల సమయంలో ఆదుకోవడంలో సింగరేణి రెస్క్యూ సిబ్బందికి దేశవ్యాప్త గుర్తింపు ఉంది. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట సమీపంలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది ఆచూకీ కోసం శ్రమిస్తున్న సైన్యం, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతోపాటు సింగరేణి నుంచి వంద మంది రెస్క్యూ బృందం ఉంది. ఎన్‌డీఆర్ఎఫ్‌తోపాటు సింగరేణి బృందం వెంటనే అక్కడికి వెళ్లి సహాయ పనుల్లో నిమగ్నమైంది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల నుంచి దాదాపు 60 మంది రక్షక చర్యల్లో పాల్గొన్నారు.
సింగరేణి యాజమాన్యం రెస్క్యూ బృందాలను అత్యంత సమర్థంగా ఖర్చుకు వెనుకాడకుండా తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం సింగరేణిలో 483 మంది సుశిక్షితులైన రెస్క్యూ సిబ్బంది ఉన్నారు. వీరంతా భూగర్భ గనుల్లో తమ రోజువారీ విధులు నిర్వర్తిస్తూనే, విపత్తుల సమయంలో సేవలు అందించడానికి ప్రత్యేకంగా శిక్షణ కేంద్రాల్లో తర్ఫీదు పొందుతారు. కోల్ ఇండియా వెలికితీసే ఉత్పత్తిలో పది శాతం బొగ్గు ఉత్పత్తి చేసే సింగరేణి రెస్క్యూ సేవల్లో మాత్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో ఉండే ఐఆర్ఎంబీ (ఇంటర్నేషనల్ మైన్స్ రెస్క్యూ బాడీ)లో కోల్ ఇండియాకు దక్కని సభ్యత్వం సింగరేణికి 2002లోనే లభించింది. దేశంలో ఎక్కడ విపత్తులు సంభవించినా, సహాయక చర్యల కోసం సింగరేణివైపు చూడటం జరుగుతోంది. హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్), హట్టి గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (హెచ్‌జీఎంఎల్), యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (యూసీఐ) లాంటి సంస్థలకు సింగరేణి విపత్తుల నిర్వహణపై ఆయా సంస్థలకు రెస్క్యూ బృందాలకు శిక్షణ ఇస్తోంది. అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లోనూ సింగరేణి సంస్థ పలు మార్లు బహుమతులు సాధించింది. ప్రస్తుతం సింగరేణి రెస్క్యూ జీఎం కె.శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ బి.మాధవరావు (డీజీఎం), శిక్షకులుగా అదనపు మేనేజర్ భాస్కర్‌రెడ్డి, డీవైఎస్ఈ నర్సింహమూర్తిలు గోదావరిఖని కేంద్రంగా సింగరేణి వ్యాప్తంగా రెస్క్యూ బృందాన్ని తీర్చిదిద్దుతున్నారు.

**వీరు అందించిన సేవల్లో కొన్ని..**

ఎనిమిదేళ్ల కింద కోల్ ఇండియాలో పైకప్పు కూలి అత్యంత విలువైన కంటిన్యూయస్ మైనర్ యంత్రం కూరుకుపోతే సింగరేణి రెస్క్యూ బృందం అధునాతన న్యూమటిక్ హైడ్రాలిక్ కట్టర్స్, స్లిట్టర్స్ సహాయంతో ఆ యంత్రాన్ని వెలికి తీసింది. కొత్తగూడెం సమీపంలోని కేటీపీఎస్‌లోని కేబుళ్లకు మంటలు అంటుకుని దట్టమైన పొగ కమ్ముకుంటే అగ్నిమాపక సిబ్బంది వెళ్లలేని స్థితిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రకాశం జిల్లా చీమకుర్తి గ్రానైట్ గనిలో పేలుళ్ల సందర్భంగా పెద్ద బండకింద చిక్కుకున్న కార్మికులను సురక్షితంగా బయటకు తీశారు. సింగరేణిలో చోటు చేసుకున్న ప్రతీ విపత్తులోనూ రెస్క్యూ బృందం సహాయక చర్యలు చేపట్టిన ఘటనలు కోకొల్లలు. బోర్‌బావుల్లో పడినప్పుడు పిల్లల్ని కాపాడిన ఘటనలు అనేకం ఉన్నాయి. బోర్‌లోకి ఆక్సిజన్ సరఫరా చేయడం, చిక్కుకున్న పిల్లల కదలికల్ని గుర్తించడానికి సెర్చ్‌కామ్ ప్రోబ్ లాంటి అధునాతన వస్తువులు సింగరేణి సొంతం.



# మిర్చి రేటు ఢమాల్..
## రోజు రోజుకు పడిపోతున్న 'తేజ'రకం ధర


ఖమ్మం: తేజ రకం మిర్చి ధర రోజురోజుకూ పతనమవుతోంది. ఖమ్మం మార్కెట్‌లో ఈ సీజన్‌లో అత్యంత తక్కువగా జెండా పాట రూ.13,350గా నమోదైంది. సీజన్ ప్రారంభంలో కొత్త మిర్చి వచ్చిన టైంలో క్వింటాల్‌కు రూ.19 వేలు పలుకగా.. తర్వాత రేటు క్రమంగా తగ్గుతూ వస్తోంది. ఒక్క నెలలోనే క్వింటాల్‌కు రూ.2500 వరకు రేటు పడిపోయింది. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టి, కూలీలు, రవాణా ఖర్చులు భరించి మార్కెట్‌కు పంటను తీసుకొస్తే కనీస ధర కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఇస్తున్న రేటుకు కూలీల ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రూ. 6 వేల నుంచి రూ. 11,500 మధ్యే...** ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్‌కు సోమవారం సుమారు 60 వేల బస్తాల మిర్చి రాగా.. ఇందులో 55 వేలకు పైగా బస్తాలను రూ.12 వేల లోపు ధరకే వ్యాపారులు కొనుగోలు చేశారు. ఎక్కువ లాట్లను రూ.6 వేల నుంచి రూ.11,500 వరకే కొన్నారు. మిర్చి క్వాలిటీ ఆధారంగా రేటు తగ్గుతుందని ట్రేడర్లు, వ్యాపారులు చెబుతుండగా.. రైతులు మాత్రం తమకు గిట్టుబాటు కావడం లేదని వాపోతున్నారు. అయితే విదేశాలకు ఎగుమతులు జరగకపోవడం వల్ల మిర్చికి డిమాండ్ లేదని వ్యాపారులు చెబుతున్నారు. చైనా, సింగపూర్, మలేషియా, థాయిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతులు జరిగిన సమయంలో క్వింటాల్‌కు రూ.25 వేల వరకు పలికిందని, ప్రస్తుతం ఎగుమతులు తగ్గిపోవడంతో రేటు తగ్గిందని అంటున్నారు.

**కోల్డ్ స్టోరేజీలకు తరలింపు...** మిర్చి రేటు రోజురోజుకు పడిపోవడమే తప్ప పెరగకపోవడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. డబ్బులు అత్యవసరం ఉన్న వారు మాత్రం వచ్చిన రేటుకు పంటను అమ్ముకుంటుండగా, భవిష్యత్‌లోనైనా మంచి రేటు రాకపోతుందా అని ఆలోచిస్తున్న వారు మాత్రం తమ పంటను కోల్డ్ స్టోరేజీల్లో భద్రపరుచుకుంటున్నారు. పంట సీజన్?పూర్తైన తర్వాత డిమాండ్ వస్తుందన్న ఆశతో ఉంటున్నారు. ఖమ్మం జిల్లాలో 2.20 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం గల 48 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. మూడేండ్ల కింద ఖమ్మం మార్కెట్‌లో మిర్చి పాతిక వేలను తాకింది. ఆ తర్వాత క్రమంగా ధర తగ్గుతూ వచ్చింది. గతేడాది కూడా దాదాపు ఇదే పరిస్థితి ఉండడంతో ఎక్కువ మంది వ్యాపారులు రైతుల నుంచి తక్కువ రేటుకు మిర్చిని కొని కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేశారు. మళ్లీ రూ.25 వేలకు పెరగకపోతుందా అన్న ఆశతో క్వింటాల్ మిర్చిని రూ.16 వేల నుంచి రూ.18 వేలకు కొని ఏసీలో పెట్టారు. కానీ ఈ సీజన్ ప్రారంభంలో మళ్లీ రూ.19 వేల నుంచే రేటు మొదలై క్రమంగా తగ్గుతూ వస్తోంది. దీంతో ఎక్కువ మంది వ్యాపారులు, రైతులు నష్టపోయారు. అయినా ఇప్పుడు కూడా అన్‌సీజన్‌లో రేటు పెరుగుతుందన్న ఆలోచనతో కోల్డ్ స్టోరేజీలకు తరలిస్తున్నారు. అక్కడ దాచుకున్న పంటను గ్యారంటీగా పెట్టి 'రైతు బంధు' కింద బ్యాంకుల నుంచి లోన్ తీసుకుంటున్నారు. మరోవైపు మార్కెటింగ్ శాఖ ఆఫీసర్లు కూడా రైతులకు ఇదే విషయాన్ని చెబుతున్నారు. తక్కువ రేటుకు అమ్ముకోకుండా, అవసరమైతే పంటను దాచుకోవాలని సూచిస్తున్నారు.

**వ్యవసాయ కూలీగానే బాగుంది...** మిర్చి రేటు ఈ రకంగా తగ్గితే వ్యవసాయం కంటే కూలీగా పని చేయడమే మంచిది అనిపిస్తోంది. ఎకరానికి రూ. 16 వేలు కౌలు చెల్లించి రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. 13 క్వింటాళ్ల దిగుబడి రావడంతో మార్కెట్‌కు తీసుకొస్తే కాయ పచ్చిగుందని చెప్పిన్రు. నన్ను కనీసం మాట్లాడనీయకుండా నా పంటకు క్వింటాల్‌కు రూ. 8 వేలు ఇస్తామన్నారు. 170 మంది కూలీలకు రూ. 350 చొప్పున ఇచ్చి పని చేయించిన. మిర్చిని మార్కెట్‌కు తీసుకొచ్చేందుకురూ. 7 వేల కిరాయి అయింది. క్వింటాల్‌కు కనీసం రూ. 20 వేలు ఇచ్చినా ఖర్చులకే సరిపోతాయి. – గన్నెబోయిన శంకర్, మైలాపురం, నల్గొండ జిల్లా

**పెట్టుబడి అయినా వస్తే చాలు...** నేను రెండు ఎకరాల్లో మిరప సాగు చేశాను. 19 బస్తాల దిగుబడి వచ్చింది. దానిని తీసుకొని మార్కెట్‌కు వస్తే క్వింటాల్‌కు రూ. 12 వేలు మాత్రమే ఇస్తాంటున్నారు. 42 మంది కూలీలతో పని చేయించి ఒక్కో కూలీకి రూ.350 చొప్పున ఇచ్చాను. రెండు ఎకరాలకు మొత్తం రూ. 1.80 లక్షల ఖర్చు అయింది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. మా పెట్టుబడి, కష్టాన్ని చూసి ప్రభుత్వమే రేటు నిర్ణయించాలి. – లకావత్ శుక్లా, మానాపురం, తుంగతుర్తి మండలం, సూర్యాపేట జిల్లా



# ట్రంప్ సోషల్ ప్రతిపాదన..
## గ్రీన్‌కార్డుదారుల్లో గుబులు..!

అమెరికాలో అక్రమ వలసదారుల ఏరివేత లక్ష్యంగా డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా సోషల్ మీడియా ఖాతాలపై దృష్టిపెట్టిన ట్రంప్ ప్రభుత్వం.. ఆ పరిధిని మరింత విస్తరించాలని ప్రతిపాదించింది. దానికింద అమెరికాలో నివసిస్తోన్న గ్రీన్‌కార్డ్‌దారులంతా తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను అప్పగించాల్సి రావొచ్చని తెలుస్తోంది. ఇప్పటికే వీసా దరఖాస్తుదారులు యూఎస్ సిటిజెన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్‌కు తమ ఖాతాల వివరాలను వెల్లడించాల్సి ఉంది. కొత్త ప్రతిపాదన అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తోన్న, శాశ్వత నివాసం, ఆశ్రయం కోరుతున్న వారికీ వర్తిస్తుంది. ఈ ప్రక్రియ మెరుగైన గుర్తింపు ధ్రువీకరణను సాధ్యం చేస్తుందని, దేశ భద్రతకు సంబంధించిన ముప్పును నివారించేందుకు దోహదం చేస్తుందని అమెరికా ప్రభుత్వం గత నోటీసుల్లో పేర్కొంది. గ్రీన్‌కార్డు పొందినంత మాత్రాన వారికి అమెరికాలో ఎల్లకాలం ఉండిపోయే హక్కు లేదు అంటూ అగ్రరాజ్య ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు లక్షల మంది వలసదారుల్లో, ముఖ్యంగా భారత సంతతి వారిలో గుబులు రేపుతోంది. దీనికి అనుగుణంగానే గత కొన్ని వారాలుగా అమెరికా తమ వలస చట్టాలను కఠినతరం చేయడం వలసదారుల్లో ఆందోళనను పెంచుతోంది. ఇక తాజా ప్రతిపాదన కింద.. అమెరికా విధానాలు విమర్శించేవారు ఆ దేశాన్ని తమ నివాసంగా మార్చుకోకుండా నిరోధించే వీలు కలుగుతుంది. అమెరికాలో చట్టబద్ధంగా నివసిస్తూ, యూఎస్–భారత్ సంబంధాల్లో చురుకైన పాత్ర పోషిస్తోన్న పలువురు భారత సంతతి వ్యక్తులపై ఈ ప్రతిపాదనలు ప్రభావం చూపేలా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే రాజకీయ అంశాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేసే పరిస్థితి లేకుండా పోతుందనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఇటీవల యూఎస్ ఇమిగ్రేషన్ అటార్నీ అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేశారు. హెచ్–1బీ, ఎఫ్–1, గ్రీన్‌కార్డు కలిగిన భారతీయులు ప్రయాణాల్లో అప్రమత్తత పాటించాలని సూచించారు. వీరు అమెరికాలో ప్రవేశించే, నిష్క్రమించే సమయంలో తనిఖీలు మరింత ఎక్కువగా ఉంటాయని, సహనంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 43 దేశాలకు చెందిన పౌరులు అమెరికాలోకి రాకుండా నిషేధం విధించాలని ట్రంప్ సర్కారు ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సంగతి తెలిసిందే. భారత్ ఈ ఆంక్షల జాబితాలో లేనప్పటికీ.. అమెరికా వెలుపల ప్రయాణాలు చేయాలనుకునే భారతీయులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. జనవరి 20న ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయగానే.. అమెరికా ప్రజల రక్షణకు సంబంధించిన పలు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు చేశారు. "గత నాలుగేళ్లలో అమెరికాలో అక్రమ వలసదారులు పోటెత్తారు. లక్షల మంది సరైన పత్రాలు లేకుండానే మన సరిహద్దులు దాటి దేశంలోకి వచ్చారు. ఆ తర్వాత ఇక్కడ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ దేశ భద్రత, ప్రజల రక్షణకు ముప్పుగా మారుతున్నారు. అందుకే అక్రమ వలసదారుల కట్టడికి చర్యలు తీసుకుంటున్నాం" అని ట్రంప్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మరో మృతదేహం వెలికితీత

అమ్రాబాద్: నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా మరో మృతదేహాన్ని గుర్తించి.. అధికారులు వెలికితీశారు. అనంతరం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. శవపరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. ఈ ఘటనలో మొత్తం 8 మంది కార్మికుల గల్లంతు కాగా.. ఇటీవల ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో ఆరుగురి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతి చెందిన వ్యక్తి ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రాజెక్టు ఇంజినీర్ మనోజ్‌కుమార్‌గా అధికారులు గుర్తించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని స్వస్థలానికి పంపిచేందుకు ఏర్పాట్లు



చేస్తామని జిల్లా కలెక్టర్ సంతోషకుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు అందిస్తామన్నారు



# ప్రసాదాలపై జీఎస్టీ మినహాయింపు
## లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటన

దిల్లీ: వస్తు, సేవల పన్ను నుంచి ప్రసాదాన్ని మినహాయిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. రెండో విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం లోక్‌సభలో జరిగిన ఆర్థిక బిల్లు 2025పై చర్చలో ఆమె మాట్లాడారు.

ఈ సందర్భంగా పలు కీలక ప్రకటనలు చేశారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో విక్రయించే ప్రసాదాలకు ఎలాంటి జీఎస్టీ వర్తించబోదని స్పష్టం చేశారు.

**డిజిటల్ పన్ను రద్దు..** ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ లేదా డిజిటల్ పన్నును కూడా రద్దు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అస్థిర పరిస్థితులను తొలగించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. లోక్‌సభలో ఆర్థిక బిల్లు 2025 (%ఖీఱఅఖఅఎవ దీఅశ్రీశ్రీ% 2025)కి ప్రతిపాదించిన 59 సవరణల్లో ఇదీ ఉంది.

**దయచేసి లైన్‌లో ఉండండి.. 15 బిలియన్ గంటలట!...** ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలను విధిస్తామని అమెరికా బెదిరిస్తున్న నేపథ్యంలో.. గూగుల్, మెటా, ఎక్స్ వంటి సంస్థలకు అనుకూలంగా ఉండేలా ఆన్‌లైన్ ప్రకటనలపై ఈక్వలైజేషన్ లెవీ తొలగించాలనే ప్రతిపాదన తీసుకొచ్చినట్లు నిపుణులు భావిస్తున్నారు. 2016 జూన్ 1 నుంచి ఆన్‌లైన్ ప్రకటన సేవలపై 6శాతం ఈక్వలైజేషన్ లెవీ విధిస్తున్నారు. ఇప్పుడా పన్నును రద్దు చేస్తున్నట్లు నిర్మలమ్మ వెల్లడించారు.

**ఆదాయపు పన్ను బిల్లు వర్షాకాల సమావేశాల్లోనే..** ఇక, బడ్జెట్ తొలి విడత సమావేశాల్లో తీసుకొచ్చిన నూతన ఆదాయపు పన్ను బిల్లును తదుపరి పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో చర్చకు తీసుకొస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు. ఫిబ్రవరి 13న ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

అనంతరం దీన్ని సెలెక్ట్ కమిటీకి పంపించారు. ఈ కమిటీ దీనిపై అధ్యయనం చేసి వచ్చే పార్లమెంట్ సమావేశాల తొలి రోజు నాటికి నివేదికను సమర్పించాల్సి ఉంది. అందువల్ల దీనిపై వర్షాకాల సమావేశాల్లో చర్చ చేపడుతామని ఆర్థిక మంత్రి తెలిపారు. ఇక, తయారీ రంగానికి ఊతం ఇచ్చేందుకు, ఎగుమతులను ప్రోత్సహించేందుకు, సామాన్యులకు ఉపశమనం కలిగించేందుకే కస్టమ్స్ సుంకాలను హేతుబద్ధీకరిస్తామని నిర్మలమ్మ వివరించారు. అనంతరం ఈ ఆర్థిక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

# అసెంబ్లీ అంటే అదీ.. మల్లారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు




హైదరాబాద్, మార్చి 25: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఏది మాట్లాడినా సంచలనమే. ఏం చేసినా ఆసక్తికరమే. ఆయన మీడియా ముందుకు వచ్చారంటే చాలు ఏదో విషయంపై మాట్లాడుతూ నవ్వులు పూయిస్తుంటారు. ఇప్పుడు తాజాగా మల్లారెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో.. అప్పటి అసెంబ్లీ సమావేశాలు.. ఇప్పుడు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల మధ్య వ్యత్యాసాలను చెప్పుకొచ్చారు. గతంలో అసెంబ్లీని ప్రజలు ఆసక్తిగా చూసేవారని అన్నారు. ఇప్పుడు మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే అన్నట్లుగా సమావేశాల్లో కనిపిస్తోందంటూ కామెంట్స్ చేశారు. అంతే కాకుండా అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, వివేక్ మధ్య జరిగిన సంభాషణ కూడా ఆసక్తికరంగా మారింది.

**మల్లారెడ్డి కామెంట్స్ ఇవే..** పార్లమెంట్‌లో ఆనాడు మాజీ ప్రధాని వాజ్‌పేయి లాంటి వారు మాట్లాడుతుంటే దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూసేవారని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి లాంటి నాయకులు సభలో మాట్లాడుతుంటే ప్రజలు టీవీలకు అతుక్కుని పోయేవారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అసెంబ్లీలో కేసీఆర్ ఏం మాట్లాడతారని ఆసక్తి ఉండేదని చెప్పుకొచ్చారు. కానీ.. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీలో మాత్రం బట్టలు విప్పుడు, కత్తులు దూసుడే కనిపిస్తోందంటూ మాజీ మంత్రి వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ కామెంట్స్ సంచలనంగా మారాయి.

**మల్లారెడ్డి, వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ...** ఇక.. అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. ఈరోజు అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి, ఎమ్మెల్యే వివేక్ ఒకరికొకరు ఎదురుపడ్డారు. 'వివేక్‌ను.. నమస్తే మంత్రి గారు' అంటూ మల్లారెడ్డి పలకరించారు. ఇందుకు థాంక్స్ మల్లన్న అని పలకరించారు వివేక్ వెంకటస్వామి. రాష్ట్రంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్యామిలీ, వివేక్ వెంకటస్వామి ఫ్యామిలీదే హవా నడుస్తోందంటూ మల్లారెడ్డి కామెంట్స్ చేయగా.. బీఆర్ఎస్ హయంలో కేసీఆర్, మల్లారెడ్డిదే హవా నడిచిందని వివేక్ సమాధానం ఇచ్చారు. 'మేము అధికారం కోల్పోయాం మాదేం లేదన్న' అంటూ మల్లారెడ్డి అనడంతో ఇద్దరు నేతల మధ్య నవ్వులు పూశాయి.



# ఎంఎంటీఎస్‌లో మహిళపై అత్యాచారయత్నం..
## అదుపులో అనుమానితుడు


హైదరాబాద్: కదులుతున్న ఎంఎంటీఎస్ రైల్లో యువతిపై అత్యాచారయత్నం ఘటనలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనలో ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని మేడ్చల్ జిల్లా గౌడవల్లి గ్రామానికి చెందిన జంగం మహేశ్‌గా గుర్తించారు. అతడి ఫొటోను బాధితురాలికి చూపించగా.. అనుమానితుడిని ఆమె సరిగా గుర్తించలేకపోయినట్లు సమాచారం. ఏడాది క్రితమే మహేశ్‌ను భార్య వదిలివేసింది. తల్లిదండ్రులు కూడా చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. గంజాయికి బానిసైన అతడు పాత నేరస్థుడని పోలీసులు పేర్కొన్నారు. మొత్తం నాలుగు బృందాలుగా విడిపోయి పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు. సికింద్రాబాద్‌తోపాటు అక్కడి నుంచి మేడ్చల్ వరకూ 28 కిలోమీటర్ల ప్రాంతంలోని రైల్వేస్టేషన్లలో అన్ని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన యువతి నగరంలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తోంది. మేడ్చల్‌లో ఉంటున్న యువతి ఈనెల 22న సాయంత్రం సెల్‌ఫోన్ రిపేరు కోసం సికింద్రాబాద్ వచ్చింది. రాత్రి 7.15 గంటలకు సికింద్రాబాద్‌లో తెల్లాపూర్–మేడ్చల్ ఎంఎంటీఎస్ రైలులోని మహిళల బోగీలో ఎక్కింది. రైలు 8.15 గంటల సమయంలో అల్వాల్ స్టేషన్‌కు చేరుకున్నాక బోగీలోని ఇద్దరు మహిళలు దిగిపోవడంతో యువతి ఒక్కతే ఉంది. బోగీలో ఉన్న ఆగంతకుడు యువతి దగ్గరకెళ్లి లైంగిక వాంఛ తీర్చాలంటూ శరీరాన్ని తాకుతూ పట్టుకోవడానికి ప్రయత్నించాడు. భయపడిన యువతి కొంపల్లి సమీపంలో ఒక్కసారిగా రైలు నుంచి దూకింది. తీవ్రగాయాలతో పట్టాల పక్కన పడి ఉన్న యువతిని స్థానికులు గమనించి 108లో గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# కేటీఆర్‌కు రాజాసింగ్ మాస్ వార్నింగ్

హైదరాబాద్, మార్చి 25: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వార్నింగ్ ఇచ్చారు. పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంటామంటూ మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన.. పోలీసు శాఖతో పెట్టుకోవద్దని మాజీ మంత్రిని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశంతో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు. ఏకంగా రేవంత్ రెడ్డి బెడ్‌రూమ్‌లోకి చొచ్చుకెళ్లి మరీ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి జైలుకు పంపారని గుర్తుచేశారు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కూడా.. ఆ సమయంలో తనను అరెస్ట్ చేసిన వారిని ఏమీ చేయలేదని తెలిపారు. కానీ 'మేము అధికారంలోకి వచ్చాక రిటైరైన పోలీసుల మీద కూడా చర్యలు తీసుకుంటాం' అని ఇప్పుడు కేటీఆర్ అంటున్నారని.. పోలీసు శాఖతో పెట్టుకోవద్దు అంటూ మాజీ మంత్రికి ఎమ్మెల్యే మాస్ వార్నింగ్ ఇచ్చారు.

# మీర్‌పేట మాధవి హత్య కేసు.. పోలీసుల చేతికి డీఎన్ఏ రిపోర్ట్

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మీర్‌పేట మాధవి హత్యకేసులో డీఎన్ఏ రిపోర్టు పోలీసులకు చేరింది. భర్త గురుమూర్తి.. మాధవిని హత్య చేసి, ముక్కలుగా నరికి ఉడకబెట్టి ఎముకలను పొడిగా చేసి చెరువులో వేశాడు. ఎలాంటి ఆధారాలు లేకుండా ధ్వంసం చేసేందుకు ప్రయత్నించాడు. ఇంట్లో దొరికిన టిష్యూస్ ఆధారంగా పోలీసులు గురుమూర్తిని అరెస్టు చేశారు. క్లూస్ టీమ్ ఇచ్చిన టిష్యూస్‌ను డీఎన్ఏ పరీక్షల కోసం పోలీసులు పంపించగా.. మాధవి డీఎన్ఏ తల్లి, పిల్లల డీఎన్ఏతో మ్యాచ్ అయినట్టు ఫోరెన్సిక్ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగ రోజున గురుమూర్తి తన భార్య మాధవిని ముక్కలుగా నరికి.. కాల్చి పొడి చేసిన విషయం తెలిసిందే.



# ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలం?: సుప్రీంకోర్టు

దిల్లీ: పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. ముగ్గురు ఎమ్మెల్యేలపై వేర్వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదన్నారు. నోటీసు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడారని.. ఆ తర్వాత కూడా భారాసలోనే ఉన్నామంటున్నారని చెప్పారు. "ఫిర్యాదులపై ఏం చేస్తారో.. 4 వారాల్లో షెడ్యూల్ చేయాలని కోర్టు ఆదేశించింది. అయినా పార్టీ మారిన వారికి స్పీకర్ నోటీసులు ఇవ్వలేదు. ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారు. 3 వారాల్లో రిప్లై ఇవ్వాలని.. ఫిబ్రవరి 13న స్పీకర్ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికి 3 వారాలైంది.. నోటీసులు ఎటు వెళ్లాయో తెలియదు. మేము ఫిర్యాదు చేసి ఏడాదైనా స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదు" అని సుందరం తెలిపారు. ఈక్రమంలో స్పందించిన జడ్జి జస్టిస్ గవాయ్.. పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయిందా అని వ్యాఖ్యానించారు. %ఇలాంటి వ్యవహారాల్లో రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు ఉన్నాయని జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం పేర్కొంది. ఎప్పటిలోగా తేల్చాలనే విషయంలో గత తీర్పులు స్పష్టంగా చెప్పలేదని పేర్కొంది. అలాంటప్పుడు ఆ తీర్పును కాదని ఎలా ముందుకు వెళ్లగలమని చెప్పింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలమని ప్రశ్నించింది. పిటిషనర్ల వాదనలు ముగియడంతో విచారణను సుప్రీంకోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660